# ఓ అంతరాత్మ కథ

కిడుగు రామారావు

"విన్నావోయ్, నన్ను రామయ్య ఏమన్నాడో ?" అన్నాడు వీరయ్య, మండువాలో పడకకుర్చీలో కూర్చుని, తాపీగా చుట్టకాలుస్తూ.

"ఏమన్నాడయ్యా?" అడిగాడు స్వామిభక్తితో పిచ్చయ్య

"నేనేదో పరాన్న భుక్కునట!" చెప్పాడు మళ్ళీ తాపీగా వీరయ్య.

"అంత మాటన్నాడా, బాబూ మిమ్మల్ని?"

"అసలు పరాన్న భుక్కంటే ఏంటోయ్ పిచ్చయ్యా ?"

"పరాన్నమంటే ఎదుటోళ్ళ తిండండీ. భుక్కంటే బొక్కేవోడండి."

"మనం ఎదుటోళ్ళతిండి ఎక్కడ తింటున్నా మోయ్? మనంపదిమందికి పెట్టున్నాంగా?"

"అంటే, బాబో- ఎదుటోళ్లు కష్టపడి, చెమటోడ్చి ఇస్తుంటే తమరు హాయిగా కూచుని తింటున్నారట!"

"అలాగా? అయితే రామయ్య భుక్తి విషయం కొంచెం చూడు." పిచ్చయ్యను అదోలా కీగంటితో చూస్తూ అన్నాడు వీరయ్య.

అంతే. పిచ్చయ్య మరో క్షణంలో అక్కడలేడు. మరో మరో క్షణంలో తిరిగొచ్చేసాడు.

"ఎక్కడ కెళ్ళావోయ్ పిచ్చయ్యా నువ్వు లేకుండా వుండలేకుండా వున్నాను!" అడిగాడు వీరయ్య

"రామయ్య లేడండీ, రామయ్య! వాడ్ని చంపి, శవాన్ని చెరువుగట్టు దగ్గర పాతిపెటొచ్చేసానండి" చెప్పాడు స్వామి ఆజ్ఞాపాలకుడు పిచ్చయ్య.

"చంపేశావా! ఎంతపని చేసావోయ్!" వీరయ్య మొసలి కన్నీరు.

"అంతేకాదండి మరి' తమరి శిష్యుడ్ని. మీ పవర్ని ఎదురించేవాడుండ గలడాండీ ఈ ప్రపంచంలో?"

"చంపావంటే, మర్డరీగా? "అడిగాడు వీరయ్య.

"అదేనండీ బాబుగారు."

"మరయితే రెంటికీ డిపరెన్సు ఏంటోయ్?"

"బాబుగారో! చంపడమంటే తెలుగు పద్ధతండి! మర్డరీ అంటే ఇంగ్లీషు పద్ధతండీ."

"అదేదో సరిగా చెప్పవోయ్" అడిగాడు వీరయ్య ఇంకా చుట కాలుస్తూ.

"తెలుగు పదతంటే బాబుగోరో, కత్తితో-దమ్ములుంటే ముందునుంచీ లేకపోతే-మీబోటి పెద్దోళ్ళు సెపే ఎనక నుంచి పొడిచేయడ వండీ ఇంగ్లీషు పద్ధతండీ, మూ సారూ, పిస్తోలుతో దూరంగా వుండి కాల్చేయడమండి"

"అయితే మనకో పిస్తోలుండటం మంచిదంటావు ?"

"ఉండాలండి బాబుగారో. డబ్బునోళ్ళందరికీ వుంటదండి. కానీ బాబో దానికో లైసెన్సీవుండాలయ్యా !"

"అదెక్కడ దొరుకుతుందోయ్?"

"పోలీసోళ్ళ దగ్గర బాబూ !"

"మనకిస్తారటోయ్ ?"

"మీలాటోళ్ళ కిస్తారు బాబూ. పిస్తోళ్ళ యాపారం, పోలీసోళ్ళు, తమబోటోళ్ళపోసనేనండి."

"లైసెన్సు లేకపోతేనేమోయ్?"

"ఫరవాలేదుగాని బాబో, వకేల ఎవడయినా ఎక్కువ కూలి డబ్బు అడిగాడనుకోండి. ఆణ్ణి కాల్చేస్తారనుకోండి, బాబుగోరో, తప్పు, తప్పు అనకూడదనుకోండి. ఆణ్ణి కాల్చేసి నందుకు, లైసెన్సులేని పిస్తోలుంచుకున్నందుకు రెండేళ్ళ జైలుశిచ్చ."

"అదేంటోయ్. ఉరితీసిం తరువాత, మళ్ళీ జైలేంటోయ్?"

"అది అంతేనండి రూల్సంటే రూల్సేనండి. ఉరితీసిన తర్వాత ఆ శవాన్ని రేండేళ్లు జైలో వుంచుతారు బాబుగారో. అదిబాగా కుళ్ళింతరువాత పురుగులు తింటాయి బాబో."

"తింటే పోలీసోళ్ళు పీక్కుతినాలిగాని, పురుగులు తింటే వాళ్ళకేటి మిగులోయ్ ?"

"అలా అనకండి బాబుగారో పోలీసోళ్లు పెద్దోళ జోలికిపోరండి. ఆళు చంపుకు తినేదీ. మనం అనయించుకునేది, బతికున్న పేదోళ్ళనండీ. అలాజైల్లో పురుగులు తినేస్తే అది ఆత్మ బాధపడి చస్తుందని నమ్మకం బాబుగారో"

"అలాగటోయ్. బాలపెద్ద సిద్ధాంతమే! అయితే చచ్చింతరువాత బాధ పడకుండా వుండాలంటే ఏంచేయాలోయ్ ?"

"బహు సులువు, బాబుగారో. మనం అంతరాత్మ నుంచుకోకూడదు బాబుగారూ. ఈ అంతరాత్మ, మనం చచ్చింతరువాత ఆత్మేమన్ని బాధ పెట్టుది."

"మరి మనిషిని గదా, కాస్తో కూస్తో అంతరాత్మ వున్నట్టుందే! అదెలా పోద్ది ?"

"బాబుగారో, ఎలక్షన్లో నిలబడండి, ఎంతైనా డబ్బు ఖరుసు చేసి, మీకెదురు లేదీవూళ్లో గెలుస్తారు బాబయ్యా. ఆతరాత మీతో గెల్చినోళ్ళి కొనేసి వో గ్రూపేసుకోండి. అపుడు మీకో మంత్రిపదవి కాయం. ఎంటనేఅంతరాత్మ అదంతటదే ఎగిరిపోద్ది, ఇక్రమార్కుడి ఈవునించి బేతాళుడి లాగా!"

* * *

వీరయ్య మంత్రయాడు. తీరిగా కాఫీ తాగి తాపీగా, డన్‌హిల్ సిగరెట్టు కాలుస్తూ. హాల్లో సోఫామీద కూర్చుని ఉన్నాడు. చటుక్కున తనముందు నుంచున్న ఆకారాన్ని చూశాడు.


"ఎవరయ్యా నువ్వు ?"

"నేను బాబుగారో, పిచ్చయ్యని, తమ నమ్మినబంటుని!"

"పిచ్చయ్యా? బంటువా? ఓహో, గురుకొచ్చింది. మా వూళ్లో వుండేవాడివి కదూ ?

"మీ వూళ్ళో ఏటిబాబో! మీ కాళ్ళ దగ్గరే పడుండేవోడ్ని మీరు చెప్పిందల్లా సేసేవోడ్ని".

> అది అంతేనండి రూల్సంటే రూల్సేనండి-ఉరితీసిన తర్వాత ఆశవాన్ని రేండేళ్ళు జైల్లో వుంచుతారు బాబుగారు. అదిబాగా కుళ్ళింతరవాత పురుగులు తింటాయిబాబు. అలా జైల్లో పురుగులు తినేస్తే అది ఆత్మ బాధపడి చస్తుందని నమ్మకంబాబు.




ఆ మాటలో వీరయ్యకి కొంచెం తెలివొచ్చింది.

"ఆఁ సరే, సరే, ఇంతకీ ఇన్నాళ్లు ఎక్కడున్నావోయ్ ?" అడిగాడు వీరయ్య తనగాంధీటోపీని సవరించుకుంటూ.

"పోలీసోళ్ళు పట్టుకున్నారు బాబయ్యా!"

"ఇంత అమాయకుడివి నిన్నెందుకు పట్టుకున్నారోయ్ ?"

"రామయ్యని చంపేశాన్ట. చంపి పూడ్చిపెట్టాన్ట బాబుగారో! మీకు తెల్దా బాబుగారో, మీ కళ్ళతో చెప్పండే అటువంటిపన్లుచేయనని?"

తెల్లఖాదీ చొక్కా, తెల్లపంచా, గాంధీటోపీ ధరించిన నల్లమనసు వీరయ్య కొంచెం గాభరాపడ్డాడు.

"పాపం. ఎవర్నీ పల్లెత్తు మాటనడే. ఆ అమాయకుడు రామయ్యని చంపింది నువ్వా? ఎందుకయ్యా ప్రశాంతంగా వున్న పల్లెటూళ్ళలో అలా హత్యలు చేస్తారు?"

మంత్రి గద్దెనుండి వీరయ్య పల్లె పునరుద్ధరణోపదేశం చేసాడు.

జైలు నుంచి తప్పించుకొచ్చిన పిచ్చయ్య నెత్తిమీద పిడుగు పడినట్లయింది. ఇంతట్లోమంత్రి వీరయ్య సెక్రటరీ ఫైళ్ళతో వచ్చాడు

"చూడు శెకటరీబాబూ! ఇతనెవరో పిచ్చయ్యట. మావూరేనట. ఎవర్నో చంపాడట. పోలీసులు పటుకుని కేసుపెట్టారుట. మనమేం చేస్తాం? రూల్సు రూల్సే! అంతాలా ప్రకారం జరగాల్సిందే! అసలు ఈ హత్యలు, హింసలూ, అంటేనే నాతత్వానికి యతిరేకం. ఈ హంతకుల మొహాలుచూస్తే, నా అంతరాత్మ గిలగిల కొట్టుకుంటుంది. శెకటరీబాబూ! ఇతని విషయమేదో చూసి, పోలీసులకి కబురుచెయ్యి" పిచ్చయ్య తెప్పరిల్లేసరికి మంత్రిగారు తమ ఆఫీసుగదిలో కెళ్ళిపోయారు.

కొన్నాళ్ళకి పిచ్చయ్యను ఉరి తీసేశారు.

• • •

ఆతరువాత కొన్నాళ్ళకు మంత్రి హెూదాలో వీరయ్యగారు తమ ఊరు సందర్శించారు. గొల్లున ఏడుస్తూ పిచ్చయ్యపెళ్ళాం ఎల్లమ్మ, వీరయ్య కాళ్ళమీదపడి దిక్కులేని తనకి, తనపిల్లలబతుక్కి ఏదయినా సహాయం చేయమని వేడుకుంది.

"ఎవరయ్యాపాపం, ఈయమ్మ? ఏదో కష్టాల్లో వున్నట్టుంది?"

"ఉరి తీసేసారు, చూశారూ, బాబుగారూ—ఆ పిచ్చయ్యగాడి పెళ్లా

# భావచిత్రాలు

★

## కునుకు

నీ చుట్టూ జరుగు తున్నది
నీకు తెలీనప్పుడు
నీ కళ్ళు తెరుచు కొని
నువ్వు చేస్తున్నపనికి పేరు
కునుకు

-ఉపద్రష్ట సాయి

★

## బాట

దారి తెలియని బాటలో
సాగిపోయామిద్దరం
తడబడె అడుగులతో
తడియారు గొంతుతో
భీతిల్లు ప్రేయసికి!
  నిండుగా నీచెయ్యి
  అండగా దొరికింది.
  నీతోడు నీడగా
  నీఅడుగు జాడతో
  నీడలా నిన్నంటి
  నేనుండగలనోయి!!
పరువాల మురిపాలు
పరవసించే వేళ్ల
నీమనసు నాదిగా
నా మేను నీదిగా
నీ అడుగు జాడలో
నే నిలువగలనోయి!!

-గోలిశంకరరావు.

★

## మహాత్ముడు

జీవితం
సమస్యల తోరణం
స్వార్ధం దీనికి కారణం
ఇది అందమైన బుగ్గమీద
అనువుగా లేచిన వ్రణం!
స్వార్ధరహిత జీవితం
వ్రాత కుపకరించని కాగితం
స్వార్ధపూరిత జీవితం
పిచ్చిగీతలు గీకిగీకి
ఖరాబు చేసిన కాగితం—
ఉపకరించని కాగితమైనా
ఖరాబయిన కాగితమైనా
పనికిరానిమాట యదార్థం
స్వార్ధాన్ని నీవు మ్రింగితే
జీవితం పరహితార్థం
స్వార్ధం నిన్ను మ్రింగినపుడు
జీవితమే అర్ధరహితం!
వినడానికిది సత్యం
అనడానికిది సాధ్యం
అచరించడానికే-అసాధ్యం!
అసాధ్యాన్ని సాధ్యం
నిస్వార్ధాన్ని నిత్యాధ్యయనం
చేయగలవాడు
ఆత్మ విశ్వాసమను వేవగలవాడు—
అతడే మాన్యుడు!
ఆ మాన్యుడే మహాత్ముడు!!

-పులికంటి కృష్ణారెడ్డి

★

## కదలిరా!

పోనీ అని నీ కోసం
నవ్వాలని ఉంది
తీరా నవ్వటానికి సిద్ధపడితే
కోటిముళ్ళు గుచ్చుకుంటున్నాయి
మనసులో
  ఎంత తేలిక ఏడుపు
  ఎంత కష్టం నవ్వటం
  రాని నవ్వులు రువ్వటం
  ఎంత కష్టం నవ్వటం
వింత నేస్తం జీవితం
కలయికల వలలే విచిత్రం
పవిత్రం
కాని ఈ మానసిక చైత్రం
ఎంత కాలం మనేను ?
ఎంత శాంతంగా మననిచ్చేను ?
  మనసిచ్చేను కుమిలేను
  మరలిమాసి అంతలో
  కుమిలేను వింత ఈ వ్యథ
  రగిలేను ఈ నేను
  మిగిలేను
  ఒంటరిగా
పాడుసుమీ విషాదం
పాడలేని విషాదం
  బ్రతుకంతా సహారా
  ఆపై ఈ అంధేరా
  ఉంటుందా సవేరా
  అంతవరకు మదిచెంతకు
  అవుడవుడూ కదలిరా!

-కేఎస్వీ

★

## హితవు

ఏమిటి సోదరీ....!
ఉన్నత విద్యతో ఉద్యోగంచేసి,
ఊళ్ళేలాలని ఊహించి
పరీక్ష పోయిందని
పరివరివిధముల బాధపడుతున్నావు
పరీక్షలు పాసయితే మాత్రం
ప్రయోజన మేముంది
ప్రథమశ్రేణిలో పరీక్షలు పాసై
పట్టాలు భుజాన వేసుకుని
ఉద్యోగాలకై ఊళ్ల తిరిగి,
పనిలేదు పొమ్మని
పరువున్న పెద్దలంతా
పరుషంగా మాట్లాడితే
విసిగి.... వేసారి....
కాలు తున్న కడుపుడు
కాస్త గంజి నీళ్ళ కోసం
శుష్కించిన శరీరానికి
చిక్కటి గోనెగుడ్డ కోసం
కనిపెంచిన కన్నతల్లి
కడుపు మంటల నార్పి
స్వర్గానికి క్షేమంగా
సాగనంపడం కోసం
సిగ్గువిడచి యాచించడానికి
సిద్ధంగా ఉన్నాం తల్లీ!
ఇదీ- చదువుకున్నవారికి
జరుగుతున్న మహోన్నత సత్కారం.
అందుకే చెవుతున్నా!
పరీక్ష పోయిందని బాధపడకు.

-మధ్యాహ్నపు లీలానంద్

★

## ఆకాంక్ష

ఓ- ప్రేమమయీ!
చివికి; చితికి చేరే
నా బ్రతుకు ఎడారిలో
ఒయాసిస్సులా నీ అగమనం
మార్చింది నా జీవితగమ్యం
నీపెదవులపై నర్తించే
ఆ చిరుదరహాసం
నా గుండె గూటితో
ప్రభవించే వసంతం
నీ కాలి అందియల సవ్వడి
నా బ్రతుకు వీణియరవళి
అది సృష్టి విలాస కేళి
ఓ- అమృత మయీ!
నామనసు అద్దంలో
నీరూపు ముద్రితమై
నాలో ఎల్లప్పుడూ
అలాగే నిల్చిపోనియ్

-అదిరాజు గీతాదేవి


దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధవైద్యం



డా॥దేవర. ఫోన్:551.
మార్కాడిగుడివద్ద,తెనాలి.
బ్రాంచి : 26-నార్త్‌బోగ్‌రోడ్, మద్రాస్ 17


---

మండి' చెప్పాడొక చిన్న మోతుబరి.

"ఉరా? పిచ్చయ్యానా? ఏం ఘోరంచేసాడు?" అడిగారు మంత్రి గారు యధాలాపంగా.

"రామయ్యని పొడిచి చంపి, పాతేసాడండి చెరువుగట్టుదగ్గర, ఎదవనాయాలు!" అన్నాడు చీద రించుకుంటూ వో బుల్లిమోతుబరి.

"రామ రామ! పాపం, ఆ రామయ్య ఆత్మ ఎంతబాధపడిందో అతనికుటుంబం ఎంతచోభించిందో" మంత్రిగారు పైపైన బాధపడ్డారు.

మంత్రిగారు బాధపడ్డందుకు అక్కడివాళ్ళంతా నొచ్చుకున్నారు.

"అయినా...." మంత్రిగారు మళ్ళీ అందుకున్నారు.

"పిచ్చయ్య తప్పుచేస్తే, ఈ ఆడ కూతురు, ఆవిడపిల్లలు అనుభవించా ల్సిందేనా? వద్దు, వద్దు. ఆబాధ నేను చూడలేను. ఆళ్ళకి ఇందు మూలంగా నేనోయెయ్యిరూపాయలు విరాళంగా ఇస్తున్నాను" అంటూ.

వీరయ్య "లేమ్మా, లే ఈడబ్బు తీసుకొని, పిల్లల్ని పిచ్చయ్యలా తయారు చేయక, ప్రయోజకుల్ని చెయ్యి," ఎల్లమ్మని పూరడించాడు.

"ఎంతగొప్ప మనసు" అని అక్కడున్న చిన్న చిన్న, బుల్లి బుల్లి మోతుబరులంతా మంత్రి వీరయ్యని నేనోళ్ళపొగిడారు. మరుసటిదినం పత్రికలన్ని మంత్రిగారి భూరివిరాళ వార్తను చదువరులకు బాగా కనబడే టట్లు ప్రచురించాయి.

పైన పిచ్చయ్య ఆత్మ పిచ్చిగా నవ్వుకుంది. క్రింద, ఎక్కడో మూల్గుతున్న వీరయ్య అంతరాత్మ భయపడింది.